VOICE OF PRAJALU
వాయిస్
ప్రజల గొంతుక - నిజం కోసం.. ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
మంగళవారం 13 అక్టోబరు 2026

# గాయత్రీదేవిగా అమ్మవారి దర్శనం



## శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయంలో.. బాల త్రిపుర సుందరి రూపంలో అమ్మవారు

వరంగల్ ( వాయిస్ టుడే ) అక్టోబర్ 12 : నగరంలోని స్టేషన్ రోడ్డు శ్రీ కాశీ విశ్వేశ్వర ఆలయం (ఆకారపు గుడి) లో శ్రీ దేవి శరన్నవ రాత్రి ఉత్సవల సందర్భంగా సోమవారం కాశీ విశాలాక్షి అమ్మవారు బాలా త్రిపుర సుందరి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్బంగా ఆలయ అర్చకులు శివ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. కార్యక్రమం పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమం లో ఆకారపు హరీష్ స్వాతి దంపతులు మరియు పొ ల శర్వాణి, గుండు శ్రీనివాస్, నవనీత్ జాజు వేముల శ్రీరాములు పాల్గొన్నారు.



## ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించాలి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

### ఐడీఓసీ ప్రజావాణికి 129 దరఖాస్తుల రాక

రాజన్న సిరిసిల్ల జిల్లా,అక్టోబర్ 12 (వాయిస్ టుడే): ప్రజావాణి కి వచ్చే దరఖాస్తులను నిర్జిత గడువు లోగా పరిష్కరిం చాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో ప్రజా వాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 129 దరఖాస్తులు రాగా, సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ప్రజావాణి లో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు, వివిధ శాఖల అధికారులు, పాల్గొన్నారు.




## అంతర్జాతీయ వేదికపై సిరిసిల్ల నేతన్న కళావైభవం

- దుబాయ్ రాజకుటుంబ సభ్యుల చిత్రాలతో ప్రత్యేక చేనేత శాలువా ఆవిష్కరణ
- తెలంగాణ గల్ఫ్ కార్మికుల తరపున దుబాయ్ పాలక కుటుంబానికి అరుదైన కానుక

రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ 12 (వాయిస్ టుడే): తెలంగాణ చేనేత కళా వైభవం అంతర్జాతీయ వేదిక పై మరోసారి ప్రత్యేక గుర్తింపు పొందింది. రాజన్న సిరిసిల్ల జిల్లా కు చెందిన ప్రముఖ చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ మగ్గం పై నూలు పోగులతో రూపొందించిన ప్రత్యేక శాలువా దుబాయ్ లో నిర్వహించిన ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అసోసియేషన్ (జుజూూ) 16వ బతుకమ్మ సంబరాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దుబాయ్ పాలక కుటుంబ సభ్యుల చిత్రాలను చేనేత వస్త్రంపై నైపుణ్యంతో నేసిన ఈ శాలువాను అక్టోబర్ 11న ఆవిష్కరించారు.తెలంగాణ చేనేత కళాకారుల ప్రతిభకు నిదర్శనంగా నిలిచిన ఈ కళాఖండం.. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న తెలంగాణ కార్మికుల తరపున దుబాయ్ పాలక కుటుంబం పట్ల గౌరవం, కృతజ్ఞతను తెలియజేసే కానుకగా రూపొందించారు. భారతదేశం, యూఏఈ మధ్య సాంస్కృతిక స్నేహబంధాన్ని ప్రతిబింబించేలా ఈ ప్రత్యేక శాలువాను తీర్చిదిద్దారు.

### మహాశక్తి ఆలయంలో అంగరంగ వైభవంగా రెండో రోజు నవరాత్రి ఉత్సవాలు

### లింగార్చనలో పాల్గొన్న కేంద్ర మంత్రి బండి సంజయ్





కరీంనగర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో గాయత్రీదేవి (బ్రహ్మచారిణి) రూపంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ నిర్వాహకులు చంద్రఘటంతో,గాజులతో అలంకరణతో అమ్మవారిని అలంకరించారు. వేలాది మంది భక్తులు ఈరోజు అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారిని దర్శించుకోవడం భక్తులకు విశేష ఆధ్యాత్మిక అనుభూతిని కలిగిస్తుంది.వేదమాతగా,జ్ఞానప్రదాయినిగా, సకల చైతన్యానికి మూలశక్తిగా గాయత్రీదేవిని భక్తులు ఆరాధిస్తారు. అమ్మవారి ఈ రూపం జ్ఞానం, వివేకం,పవిత్రత,ఆధ్యాత్మిక తేజస్సుకు ప్రతీకగా నిలుస్తుంది.దసరా నవరాత్రుల్లో గాయత్రీదేవి దర్శనం భక్తులకు ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందించడంతోపాటు జ్ఞానానికి,ధర్మానికి ప్రాధాన్యమివ్వాలనే సందేశాన్ని గుర్తుచేస్తుంది.జ్ఞానమార్గంలో నడిపించే జగన్మాతగాయత్రీదేవి ఆరాధన ద్వారా విద్య,వివేకం,ఏకాగ్రత,సత్ప్రవర్తన కలగాలని భక్తులు ప్రార్థిస్తారు.అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని పెంపొందించుకోవడం, మంచి ఆలోచనలతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవడం ఈ ఆరాధనలోని ప్రధాన సందేశంగా భావిస్తారు.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం అమ్మవారి ఆలయంలో లింగార్చన కార్యక్రమానికి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.పిండితో లింగాకారం ప్రతిష్టించి అభిషేకం చేశారు.దీపాలు వెలిగించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేశ్ సహా పలువురు నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు.మరోవైపు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు సైతం దాండియా నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు.వేలాది మంది భక్తులు అధ్యాత్మిక భావనతో ఆడుతూ పాడుతూ దాండియాలో పాల్గొనున్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రతిరోజు ఉదయం నుండి రాత్రి పొద్దుపోయే వరకు ఆలయంలో అమ్మవారి సేవలోనే గడుపుతున్నారు.



## అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : సూర దేవరాజు

- సిరిసిల్లలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేసిన పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు

సిరిసిల్ల, అక్టోబర్ 12 (వాయిస్ టుడే): పేద ప్రజలకు సొంతింటి కలను సాకారం చేసి, వారికి గూడు నీడ కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని 11వ వార్డు ముష్టిపల్లికి చెందిన దాసరి అరుణ, వేముల సత్యవ్వలకు మంజూరైన రెండు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సూర దేవరాజు చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,పట్టణాలు, గ్రామాల్లో ఇళ్లు లేని నిరుపేదలకు సొంత ఇల్లు కల్పించాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి వారి ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.ఇప్పటికే వేల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొంటూ, దసరా నాటికి రెండో విడతలో మంజూరయ్యే ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పట్టాలు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పేద ప్రజల ఆశలను నెరవేరుస్తూ వారి కళ్లల్లో ఆనందాన్ని చూడాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పమని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజలకు అండగా నిలుస్తోందని సూర దేవరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ కార్యదర్శి వంతడుపుల రాము, వార్డు అధ్యక్షుడు వంగరి అనిల్, ఆకని సతీష్, ఆడెపు, పల్లపు శ్రీను, ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు ఎం.డి. కలీం, కొండ ప్రకాష్, మ్యాన పద్మనాభం, సత్యనారాయణ, సృజన్ పాల్గొన్నారు.

## 15 అక్టోబర్ రోజు అమ్మవారి భక్తి గీతాలాపన పోటీలు



కరీంనగర్, అక్టోబర్ 12(వాయిస్ టుడే): శరన్నవరాత్రుల పర్వదినోత్సవాల్లో భాగంగా తెలుగు భాషా సంరక్షణ సంఘం, శాతవాహన లయన్స్ క్లబ్,లీడ్ ఇండియా నేషనల్ క్లబ్బుల సంయుక్తంగా నిర్వహణలో 15 అక్టోబర్ 2026 గురువారం ఉదయం 10 గంటలకు మంకమ్మతోట సాయి మానేరు హైస్కూలు ఆవరణలో పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు అమ్మ వారి భక్తి గీతాలాపన పోటీలు నిర్వహించబడతాయని సంస్థ ప్రధాన కార్యదర్శి లయన్ కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొమ్మకంటి కిషన్ పత్రికా ప్రకటనలో తెలియజేశారు. నేటి పాఠశాల బాలబాలికల్లో ఆధ్యాత్మిక చింతనకు పునాదులు పడాలనే సదుద్దేశంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి పాటల పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానం చేయడం జరుగుతుందని గమనించగలరు.ఆసక్తి ఉన్న గాయకులు తమ పాఠశాల గుర్తింపు కార్డులతో పాల్గొనగలరు.పూర్తి వివరాలకు,పేర్లను నమోదు చేసుకోవడానికి o91 94946 80785 లేదా 7672-075038 నంబరులో సంప్రదించాలని కోరారు.

## రైతుల గురించి మాట్లాడే అర్హత బి ఆర్ ఎస్‌కు లేదు

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను రాజకీయం చేస్తారా?

రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

కాంగ్రెస్ నేతల విమర్శ



కరీంనగర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే): రైతుల సంక్షేమం గురించి మాట్లాడే నైతిక అర్హత బీఆర్ఎస్ నేతలకు లేదని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు.దేశవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో కరువు ఛాయలు అలుముకుంటున్న నేపథ్యంలో రైతుల సమస్యలను రాజకీయాలకు వాడుకోవడం సరికాదన్నారు.రైతులపై కపట ప్రేమను ప్రదర్శిస్తూ ప్రజలను, రైతులను రెచ్చగొట్టే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు. రైతుల సంక్షేమం,పంటల రక్షణే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న,కరీంనగర్ రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామ్ రెడ్డి రామ్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి అనంతుల రమేష్,కాంగ్రెస్ పార్టీ సర్పంచులు నాయకులు కరీంనగర్ రూరల్ మండలం చామనపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.కరీంనగర్ రూరల్ మండలంలో గతంలో వడగళ్ల వానతో పంటలు దెబ్బతిన్నప్పుడు ఎకరాకు రూ.10 వేల చొప్పున పరిహారం ఇస్తామని ప్రకటించి, చివరకు రైతులకు ఒక్క పైసా కూడా చెల్లించలేదని విమర్శించారు. పదేళ్లపాటు రుణమాఫీ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదేనన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేసిందని గుర్తుచేశారు.ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొంటున్నాయని,ఇలాంటి సమయంలో రైతుల సమస్యలను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొందాలని చూడడం సరికాదని అన్నారు. కరెంటు కోతలు, మోటార్లు కాలిపోతున్నాయంటూ రైతుల్లో ఆందోళన కలిగించే వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా రైతులను ఆందోళనకు గురిచేయడం మానుకోవాలని సూచించారు. రైతులకు రుణమాఫీతో పాటు పంటల రక్షణ,సాగునీటి సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని నాయకులు తెలిపారు.రైతుల కష్టాలను అర్థం చేసుకుని వారికి అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను ప్రజలు గమనిస్తున్నారని,రైతుల పేరుతో రాజకీయాలు చేస్తే తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.



## మేదరి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

కరీంనగర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే):జిల్లా మేదరి మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కరీంనగర్‌లోని సంఘ భవనంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయబద్ధంగా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను తొమ్మిది రోజులపాటు పూలను పూజిస్తూ ప్రత్యేకంగా జరుపుకోవడం ఎంతో గొప్ప విషయమని నిర్వాహకులు పేర్కొన్నారు.మహిళల ఐక్యతకు, తెలంగాణ సంస్కృతి వైభవానికి బతుకమ్మ వేడుకలు ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య బతుకమ్మ వేడుకలు జరుపుకోవడం సంతోషకరమని అన్నారు.ఈ కార్యక్రమంలో మేదరి మహిళా సంఘం నగర అధ్యక్షురాలు వాణిశ్రీ, ప్రధాన కార్యదర్శి పిట్టల స్వప్న, లక్ష్మీ,భాగ్య,జ్యోతి,సుజాత పాల్గొన్నారు.

## ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు ఇంజనీర్ కోల అన్నారెడ్డికి ఘన సన్మానం



కరీంనగర్,అక్టోబర్ 12(వాయిస్ టుడే): జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యవర్గానికి జరిగిన ఎన్నికల్లో శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి 1,961 ఓట్లు సాధించి, మొత్తం 17 మంది అభ్యర్థుల్లో రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన సాధించిన విజయాన్ని పురస్కరించుకొని,శ్రీ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో పాఠశాల ప్రబంధకారిణి తరపున ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎలగందుల సత్యనారాయణ,గట్టు శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్,పులాల శ్యామ్,చింతల కిషన్ బొడ్ల శ్రీనివాస్,కొత్తూరి ముకుందశీ,రాపర్తి శ్రీనివాస్,తాటి రాజేశ్వర్ రావు,గట్టు రాంప్రసాద్,నడిపెల్లి దీన్ దయాల్ రావు,ఆచార్యులు,మాతాజీలు పాల్గొని ఇంజనీర్ కోల అన్నారెడ్డికి అభినందనలు తెలియజేశారు. శిశుమందిర్ డెవలప్మెంట్ కమిటీ కార్యదర్శిగా పాఠశాలను అభివృద్ధి చేసి, సమాజ సేవ పట్ల ఆయనకున్న నిబద్ధత,సేవాభావం మరింతగా విస్తరించాలని, భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పాఠశాల ప్రధానచర్యులు మోర రణధీర్ ఆకాంక్షించారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**